# సాటి తెలుగువారిని అవమానిస్తావా?



## నీకు ఉద్ధవ్ థాకరే గతి పడుతుంది

## కేసీఆర్‌పై మండిపడ్డ సోమిరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: సమైక్యాంధ్ర వాదనకు నీతి, జాతి లేదని తెరాస అధినేత కేసీఆర్ విమర్శించడాన్ని తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది 5 కోట్లమంది సీమాంధ్ర ప్రజలను అవమానించటమేనని మండిపడ్డారు. అసలు కేసీఆర్ నీతి, జాతి ఏంటో చెప్పాలని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తెలుగువాడు కాదా? ఆయన తాతముత్తాతల జాతి ఏంటి? .. అరవమా? మరాఠీ జాతా? , దొరల జాతా? దళితుల జాతా? చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ ఓట్లు అవసరమైనప్పుడు దళితుల జాతి అని, పదవులు కావాలంటే దొరల జాతి అంటారని విమర్శించారు. పదవులన్నీ ఆయన ఇంటివరకే పరిమితం చేస్తారని పేర్కొన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'కేసీఆర్ నోటి దురదను చాలా ఏళ్లనుంచి చూస్తున్నాం. గద్దర్‌కు ఉద్యమాల సంగతేం తెలుసని అన్న కేసీఆర్, మళ్లీ ఇంకోసారి గద్దర్ లేనిదే ఉద్యమం లేదని చెబుతారు. మేం కూడా తనలాగే స్పందిస్తామని కేసీఆర్ భావించి ఉంటారు. మేం కలిసుండాలని కోరుకుంటున్నవాళ్లం. తెలంగాణ సోదరుల పట్ల మాకు అత్యంత గౌరవముంది. ఎవరి ఉద్యమం వారు చేసుకోవచ్చు. అంతిమంగా ఫలితం ప్రజల అభీష్టం మేరకే ఉంటుంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరేకు పట్టిన గతే కేసీఆర్‌కు పడుతుంది. ముంబయిలో థాకరేలు మరాఠీయులు కాని వారిని విమర్శిస్తుండగా.. కేసీఆర్ మాత్రం సాటి తెలుగువారినే తిడుతున్నారు. ఆయన తిట్లపురాణం ఆపి పద్ధతిగా రాజకీయాలు చేయాలి. లేదంటే ప్రజలే తరిమికొడతారు. సీమాంధ్ర వాళ్లు కూడా ఉప్పు, కారం తింటున్నారు. ముంబయిలో మరాఠేతరుల రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటామన్న చిదంబరం.. హైదరాబాద్ విషయానికి వచ్చేసరికి మాత్రం ఎందుకు మాట్లాడరు? సమైక్యాంధ్ర విద్యార్థుల జేఏసీ పాదయాత్రను అడ్డుకోవడం, అరెస్టు చేయడం గర్హనీయం. విభజన వాదులు హైదరాబాద్ నుంచి ఏ కార్యక్రమమైనా చేపట్టవచ్చుగానీ.. సమైక్యవాదులు మాత్రం రాష్ట్ర రాజధానికి రాకూడదా? సమైక్యాంధ్ర విద్యార్థులుపై దాడులు చేస్తుంటే రక్షణ కల్పించాల్సింది పోయి వారినే అరెస్టు చేయడం ఏమిటి? దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్, మానవహక్కుల సంఘాలు ఏం చేస్తున్నాయి? ప్రధాని మన్మోహన్‌సింగ్ స్పందించరేం? సీమాంధ్ర ప్రజలను ప్రధాని, చిదంబరం చెత్తబుట్టలో పడేశారా? ' అని సోమిరెడ్డి ప్రశ్నించారు.